# నన్నుక్షమించరూ!

ప్రశాంత్



లలిత వంటింట్లో పనంతా ముగించుకొని తన గదిలోకి వచ్చింది. హాల్లో గడియారం పది గంటలు కొట్టింది. ఆ నిశ్శబ్దంలో గంటల చప్పుడు ఒక టికి వాలుగింతలైనట్టుంది. యిల్లంతా ప్రతి ధ్వనించింది.

లలితకివాళ ఒంట్లో ఒకే బడలికగా వుంధి. రక రకాల ఆలోచన్లతో తలవేడెక్కి అలసిపోయి నొస్తోంది.

లైటార్పి పరుపుపై పడింది. వెల్లకిలా పడు కొని కళ్ళు మూసుకుంది. పక్కలకు పొర్లింది. "ఉహూ !" లాభంలేదు. తనకు నిద్రరాదనుకొంది. "ఏం చెయ్యాలి?"

విసుగుతో లేచి కూర్చొంది. లైటువేసి సగం చదివిన నవల తీసుకొంది. పేరు "మూగప్రేమ" బాల్యవితంతువైన ఒక అబల ప్రేమగాథ. యవ్వ నం అంకురిస్తూనే ప్రకృతి సహజంగా, ఆగర్భ శ్రీమంతుడు, అందగాడు, ఐన ఒక యువకుణ్ణి వలచింది. అతనిపట్ల తన ప్రేమను మూగగా చూపుతూంది. అతడుకూడా ఆమెను అర్థం చేసు కొని, తన హృదయంలో ఆమెపట్ల జాలి, సానుభూతి నిండుగా నింపుకొన్నాడు. అయితే విధి నిర్ణయాన్ని బట్టి అతనికి యింకొక అమ్మాయితో పెళ్లైంది. భార్య లేడి డాక్టరు. భార్యాభర్తల్లో ఒకరి భావాలు ఒకరికి సరిపోలేదు. పెళ్లై ఆరు నెలలు తిరగ కుండానే విడాకులు యిచ్చుకొనే దాకా వచ్చింది వారి దాంపత్యం. కథానాయకి ఆ విడాకుల పర్యవసనాన్ని వూహించుకొని గాలిలో మేడలు కట్టుకొంటోంది. ఆ తర్వాతైనా తన ప్రేమికుడు తన్ను దగ్గరికి తీసు కుంటాడని ఆమె ఆశ.

లలిత రెండు పేజీలు చదివింది. చదివిందేమో తల కెక్కలేదు. అస్సలు అర్థంకాలేదు. అంతు లేని విసుగుతో పుస్తకం మూసి మళ్ళీపడుకొంది. ఈసారి ఆమె ఆలోచన్లు తన జీవితం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

"అమ్మా నాన్నలకు తాము నలుగురు బిడ్డలు. తను అందరికంటే చిన్నది.అక్కయ్యకు పెళ్ళైంది. ఎంత కాలమైనా పిల్లల్లేరు. అదొక్క బెంగ తప్పిస్తే వారి సంసారం సుఖసంతోషాల నిలయం. ప్రస్తుతం ఢిల్లీలో వుంటున్నారు, అక్కా బావా"

"పెద్దన్నయ్య ప్రకాశ్ బాంకులో ఆఫీసర్. చేతి నిండా వచ్చే జీతంతో, అందమైన వదినో, ముద్దులు మూటగట్టే యిద్దరు పిల్లల్తో హైదరాబాదులో వుంటున్నాడు. వాడి జీవితం వడ్డించిన విస్తరి లాంటిది. వారి సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంది."

"రెండో అన్నయ్య రమేశ్. వాడికి చదువు సంధ్యలు వంటబట్టలేదు. నాన్నతో తగువుపెట్టుకొని యింటిలోంచి అలిగి వెళ్లిపొయ్యాడు మిలిటరీలో చేరాడు. ప్రస్తుతం ఫ్రంట్‌లో వుంటున్నాడు. అక్కణ్ణుంచి వాడు వ్రాసే వుత్తరాల్లో చైనా వాళ్ల దాడిని మనవాళ్ళ ధర్మయుద్ధాన్ని వివరించే వాడు. ఆ సంఘటనలు, ఫలితాలు చదువుతుంటేనే ఒళ్ళు చెమటలు పట్టేవి. ఒకసారి యిరవై ముప్పై మంది చైనా వాళ్ళమధ్యపడి కోతుల్లాగ కిచకిచ లాడుతూ నవ్వుతూ వుండే వాళ్ళు ఐపులేకుండా పోయార్ట. ఇంకొక్కసారి అన్నయ్య స్నేహితుడు నవ్వుతూ మాట్లాడుతూ అల్లాగే ఒరిగి పొయ్యాడట. చూస్తే తలలో బుల్లెట్ దూరిందట! యిల్లాంటివెన్నో.. ... పాపం! చిన్నన్నయ్య అనుక్షణం మృత్యుదేవత గుప్పిట్లో వున్నాడు."

"ఇక తాను. అభాగ్యురాలు. పెళ్ళైన సంవత్సరానికే భర్త తిరిగిరాని చోటికి వెళ్ళిపోయాడు. తన బ్రతుకు ఎండిన మోడైంది.అత్తింటివాళ్ళు భర్తను పొట్టపెట్టుకున్న అమ్మవారని తన్ను తన్ని తగిలేశారు. అసలు తనకు వివాహమైనపుడే అన్యాయం జరిగింది. మెట్టినింట్లో యింట్లో వాళ్ళు, వచ్చే పొయ్యేవాళ్ళతో సహా పాతికమంది వుండేవాళ్ళు. వాళ్ళందరికి దినదినం వంటావడ్డన చేసి ముగించే టప్పటికి తన నడుములు విరిగి పొయ్యేవి. భర్త పుట్టు అర్భకుడు. రోగిష్ఠి. రాత్రింబగళ్ళు ఆయన సేవల్తో కూడా ఆరు నెలల్లో తాను ప్రాణాలు కళ్లల్లో పెట్టుకొని పీనుగయ్యింది. దీనికితోడు చిన్నాపెద్దా అనకుండా అందరితోను దెప్పులు, చివాట్లు సంవత్సరకాలం నరకం అనుభవించింది. మంచికో, చెడుకో అంతలో విముక్తి లభించింది."

"భర్త చనిపోతూనే పుట్టింటికి వచ్చేసింది. తన్నూ, చిన్నన్నయ్యను తల్చుకొని అమ్మానాన్నా కంటనీరు పెట్టని రోజులేదు. కాలంగడచిపోతుంది. తానిప్పుడు ఇరవై ఎనిమిదేళ్ళ ప్రౌఢ జీవితం ఎటు వైపునుంచి చూసినా అంధకారమయం అయినా మొండి ధైర్యంతో రోజులు గడుపుతోంది. ఏమివ్వక పోయినా దేవుడు ఆపాటి గుండెనిబ్బరం యిచ్చాడు."

లలిత ఆలోచన్లు ఒక మలుపు తిరిగాయి.

"సుజాత తనకు వరుసలో చెల్లెలవుతుంది. పిన్ని కూతురు. ఆమెకు పెళ్ళై రెండు సంవత్సరాలవుతోంది. మొగుడు శేఖర్. ఇంజనీరు. సుజాతకు నెల తప్పినా ఆమెను పురిటికి పంపనని మొండి కేసుకూర్చొన్నాడు. సుజాత కూడా పుట్టింటికి రానంది. పిన్నికి, చిన్నాన్నను వదిలి యిక్కడికి రావడానికి మనస్సు ఒప్పదు. అందుకే కాన్పైన తర్వాత జాబు వ్రాస్తే పదిహేను రోజులు గడిపించి వెళ్ళతానందిట."

"సుజాతకేం తోచిందో ఏమో తనకు జాబు వ్రాసింది రమ్మని. అమ్మా నాన్నా కూడ వెళ్ళమన్నారు తన్ను."

"తను బొంబాయికి వచ్చి వారం రోజులు గడిచి పొయ్యాయి. తనకు కూడా సరదాగానే వుంది. ఎందుకో?" లలిత మనస్సు సమాధానం చెప్పటానికి నిరాకరించింది.

"శేఖరం మరీ పసి పిల్లవాడిలాగ వుంటాడు. మాటల్లోను, చేతల్లోను. యింట్లో వుండేంత వరకు సుజాతను సరిగ్గా వూపిరి సలుపుకోనివ్వడు. 'సుజా! సుజా!' అంటూ నిమిషానికోసారి పిలుపు. పొద్దున లేచినప్పటినుండి ఆఫీసుకు వెళ్లేంతవరకు సుజాత భర్తని, స్కూలుకు పంపించే పసిపిల్లవాడి కిలా బుజ్జగించి, అలంకరించి భోజనంపెట్టి సాగనంపుతుంది. మధ్య మధ్య చీవాట్లతో సహా. సుజాత చివాట్లు పెడ్తుంటే మరీ పెట్రేగిపోతాడు శేఖర్. పాపం! నిండు గర్భిణిఐనా ఎంతో నెమ్మదిగా భర్తకి పరిచర్య చేస్తూనేవుంది సుజాత!"

సాయంకాలం శేఖర్ తిరిగొచ్చేటప్పటికి, సుజాత అలంకరించుకొని అతనికోసం ఎదురు చూస్తుంటుంది. భర్తకి కాఫీ, టిఫిన్ అందించి, నవ్వుతూ, తుళ్ళుతూ, అతని అలసటనంతా మాయం చేస్తుంది. కాస్సేపటికి యిల్లు తన కప్పచెప్పి చేతులు కలుపుకొని బైటకు వెళ్తారు. రెండు మూడు దినాలు తానూ వెళ్ళింది, వచ్చిన కొత్తలో వాళ్ళతోపాటు. తర్వాత వారితో కలసి వెళ్ళటానికి మనసు రాలేదు. ఎనిమిది గంటలకు తిరిగొస్తారు, వాళ్ళిద్దరు. వాళ్ళకు వడ్డించి, తాను భోంచేసి, వంటింట్లో పని ముగించి బైట పడేటప్పటికి పది గంటలవుతుంది రోజూ."

"తను బొంబాయికి వచ్చిన రోజు సుజాతా శేఖర్ యిద్దరూ వచ్చారు స్టేషనుకు. ట్రైను లోంచి చూస్తే ఎంత ముచ్చటగా వున్నారని. దేవుడు వీరిద్దర్ని ఒకరి కోసమే యింకొకర్ని సృష్టించాడేమో అనిపించింది. శేఖర్ పక్కన నిలబడివుండే సుజాత మరీ అందంగా నిండుగా కనిపించింది."

"అక్కా! వదినా!" అంటూ తన్ను యిద్దరు నోరారా పిలుస్తుంటే తనకు ఏదో కొత్తగా వుంది. వారిద్దరి మధ్య వుంటూంటే తనకు ఉత్సాహం బలం అవంతట అవే వస్తున్నాయ్. బ్రతుకంటే ఆశ చిగురిస్తోంది."

ఆ మర్నాడు పొద్దున లలిత వంటింట్లో వుంది. సుజాత శేఖరం మాటలు వినపడ్తున్నాయ్.

"ఆహా! దేవుడు కాస్త ఎర్ర మూతి నిచ్చాడని ఎంతసేపు అద్దంలో చూస్కొని నిలబడడం లెండి! లెండి! అవతల ఆఫీసుకు టైమవుంది.' అంటోంది సుజాత.

"ఏయ్! నేనేదో క్రాపింగు కుదరక అవస్థ పడుతూంటే! ఐనా నీవు మెచ్చిందేకదా ఈమూతిని. నీకు మంచి బహుమతి యిస్తానుగాని, రా యిలా! దువ్వి పెడుదువుగాని!"

"హు! తప్పుతుందా! తలకాయ వంచండి. అబ్బ! ఏమిటీ వెంట్రుకలు. లక్షణంగా జడవేసి పూలు పెట్టొచ్చు. యిదో! కదుల్తున్నారు. వాక్కోసం వస్తుంది."

"ఏ సుజీ! ఎంత గట్టిగా మొట్టికాయపెట్టడం, చూడు నొప్పితో నా కళ్లల్లో నీళ్ళు తిరుగుతున్నాయి."

"నా బుజ్జీ! నొప్పెడుతోందా? సాయంకాలం వరకు జ్ఞాపకం పెట్టుకొని త్వరగా యింటికి వచ్చేయండి. అదో! అలా ముఖం పెడ్తే నేనివ్వాళ్ల మిమ్మల్ని ఆఫీసుకు వెళ్ళనివ్వను."

"ఏం చేస్తావో? వెళ్ళనివ్వక!"

"ఏదో చేస్తాను పూజ చేసుకొంటాను! చాలా? ఊఁ! త్వరగా తెమలండి మరి."

"పెంద్రాళే వస్తేనో! ఏమిస్తావు?"

"మీ మామూలు వుండనే వుందిగా!"

"మరిప్పటిది!"

"యిస్! యెస్నేమిటి! వదలండి."

"రామచంద్రా! వదల్రు! అదో అక్కయ్య వచ్చింది."

అంటూ తుర్రున పరిగెత్తుక వచ్చింది ఆయాసపడుతూ. వంటింట్లోవున్న లలితను చూసి అమాయకంగా నవ్వింది.

రెండ్రోజుల తర్వాత వారిద్దరు లలితను సినిమాకు రమ్మన్నారు. లలితకు సినిమాకు వెళ్ళాలని వున్నా వారితోపాటు వెళ్ళటానికి మనస్కరించ లేదు తలనొప్పని రాలేనంది. వాళ్ళూ వద్దనుకొంటే తానే బలవంతం చేసి పంపించింది, లలిత.

సుజాతా శేఖర్లు సినిమా నుంచి వచ్చేటప్పటికి లలిత భోంచేసి గదిలో పడుకొనుంది. వారు భోజనాలకు కూర్చొంటుంటే లలిత వెళ్ళింది వడ్డిస్తానని. ఐతే సుజాతా శేఖర్లు వద్దంటే వద్దని బ్రతిమాలి ఆమెను పడుకొమ్మని పంపించారు. ఇక తప్పనిసరిగా తన గదిలోకి వచ్చేసింది లలిత. వారి మాటలు వినపడుతున్నాయ్.

శేఖర్ అంటున్నాడు "సుజా! నాకు మజ్జిగన్నం అక్కర్లేదు. కడుపు నిండిపోయింది."

"వద్దంటే వినవా? నేను తిన్ను. నువ్వేతిను."

"ఏయ్! ఏమిటది? మజ్జిగన్నం తినకపోతే వేడి చేస్తుంది వూ! త్వరగా కానివ్వండి. అర్థరాత్రి అయింది."

"వూహూ! నేను తిన్నంటే తిన్ను."

"సరే, నామాట వినరన్నమాట! ఏలా తినిపించాలో నాకు తెల్సు. వూ! నోరు తెరవండి. ఇప్పుడు చూడు అబ్బాయిగారికి ఎలా మింగుడు పడ్తున్నదో!"

"సుజా! మరి నేను నీకు!"

"అమ్మోమ్! ఇదేమిటి? వేలు కొరికావ్!"

"అది మీవేలా? నాకు ఆవకాయ ముక్కని పించింది. అబ్బ! ఎంత రుచిగావుందో!"

"నిన్ను! నిన్ను.. ....."

"ఆ! అవన్నీ తర్వాత. ముందిక్కణ్ణుంచి లేస్తారా? నాకింకా బోలెడు పనుంది"

"సుజా! పది నిముషాలు టైమ్. రాకపోయావో అస్సలు నీతో మాట్లాడను, మళ్ళీ."

"అబ్బ! వస్తున్నా! పదండి"

లలితకు ఆ దంపతుల దాంపత్యం చూసి సంతోషం, తనపై అంతులేని జాలి, విధిపై వుక్రోషం, ఒక్కసారి కలిగాయి.

"సుజాత సంసారంలో అమృతం చిందులొలుకుతూంది. స్త్రీగా, భార్యగా సుజాత తన జీవితాన్ని సార్థకం చేసుకొంటూంది. తనే సుజాతయ్యుంటే!" లలిత ఆలోచనలకు అవధుల్లేవు.

మర్నాడు పొదున కాఫీ చేస్తుంటే వెనుక ఏదో చప్పుడు అయింది. లలిత వెనక్కు తిరిగిచూసింది. శేఖర్ నీరసంగా నిస్సహాయంగా నిలబడి వున్నాడు

"వదినా! సుజాతకి సుస్తీగా వుంది మిమ్మల్ని రమ్మంటోంది" అన్నాడు శేఖర్ విచారంగా.

లలిత వెళ్ళి చూసింది. సుజాత ఒళ్ళు వేడిగా వుంది. నవ్వుతూనే "అక్కయ్యా! కాస్త ఒళ్ళు నొప్పులు, జ్వరం పోతుందిలే!" అంది సుజాత

"సుజా! డాక్టర్ని పిలుచుకొస్తా" అన్నాడు శేఖర్.

"డాక్టరూ వద్దు, యాక్టరూ వద్దు మీరు ఆఫీసు కెళ్ళండి. నాకేం ఫర్వాలేదు" అని శాసించిందామె.

"చూడండి వదినా! తన్ను యిలా వదలి నేను ఆఫీసు కెళ్ళాలట! ఎలా వెళ్ళడం?" అన్నాడు శేఖర్ దీనంగా.

"అక్కయ్యా, నీవైనా చెప్పు. ఈ కాస్త జ్వరానికే యింత గాభరా పడితే ఎల్లాగ? ఇంకా ముందున్నది ముసళ్ళ పండుగ" అంది సుజాత నవ్వుతూ

"సుజా! నువ్వలా మాట్లాడకు. నాకు భయమేస్తుంది." అన్నాడు శేఖర్ ప్రార్థిస్తున్నట్టుగా

# నన్ను క్షమించరూ!

కొసకు లలిత "ఫర్వాలేదు లెండి మీరు వెళ్ళండి నేనున్నాగా!" అంది ధైర్యం చెపూ

శేఖరం అయిష్టంగా కదిలాడు అక్కణ్ణుంచి సుజాతను వదల్లేక వదల్లేక వెళ్ళాడు ఆఫీసుకు. ఆరోజు భర్తని బతిమాలి పంపించేటప్పటికి సుజాతకు తలప్రాణం తోక కొచ్చినట్టయింది.

సాయంత్రాని కూడా జ్వరం తగ్గలేదు డాక్టర్ని వెంటపెట్టు కొచ్చాడు, శేఖర్

డాక్టర్ సుజాతను పరీక్షించి, యేదో విషజ్వరమన్నాడు. ఆమె గర్భవతని తెలుసుకొని తమ నర్సింగ్‌హోమ్‌లో చేరిస్తే మంచి దన్నాడు

శేఖర్ అవస్థ వర్ణనాతీతం! కళ్ళలో నీళ్ళు నింపుకొన్నాడు. సుజాత అతన్ని బుజ్జగిస్తూ, వోదారుస్తూ, మధ్య మధ్య మందలిస్తూ ధైర్యం చెపూ్తవుంది డాక్టర్ చెప్పిన మేరకు సుజాత వద్దని ఎంత చెప్పినా వినకుండా, శేఖర్ ఆమెను నర్సింగ్ హోమ్ చేర్పించాడు.

నర్సింగ్ హోమ్‌కు అందరూ వెళ్ళారు అక్కడ సుజాత మూడు నాలుగు రోజులువుంటే చాలన్నారు

"అక్కయ్యా! నీ కెంత కష్టం యిస్తున్నాం!. ఏమండీ! అక్కకు మరీ ఎక్కువ పని పెట్టకండి. ఈ మూడు నాలుగు రోజులు ఎలాగో సర్దుకోండి" అనింది సుజాత

"ఏమిటి సుజాతా! నువ్వు మరీను, నాకేం కష్టం మధ్య. నువ్వు హాయిగా విశ్రాంతి తీసుకో" అంది బాధ పడుతూ లలిత

సుజాతను ఒక పట్టాన వదిలి రాలేదు శేఖర్. సుజాతకూడా భర్త వెళుతున్నాడంటే కళ్ళలో భయాందోళనలు నింపుకొని దిగాలుగా వుంది వాళ్ళిద్దరి ఆవేదనను చూడలేకపోయింది కొనకు డాక్టర్లు వచ్చి ఏం భయంలేదని శేఖర్ని సాగనంపారు

ఆ రాత్రి భోజనానికి హోటలుకు వెళ్ళారు యిద్దరూ శేఖర్ మనసు సుజాత దగ్గరే వదిలేసి వచ్చాడు. విస్తట్లో ఎక్కడి వక్కడే వదిలేశాడు. విధిలేక కాస్త ఎంగిలిపడ్డాడు

లలిత రెండు రూపాయలు దండుగంది.

అతను దిగాలుగా నవ్వాడు.

పొద్దున శేఖర్ ఎంతసేపటికీ లేవనే లేదు. లలిత అతనికోసం ఎనిమిది గంటలవరకు ఎదురు చూసింది, రూము నుంచి బైటికి వస్తాడేమోని. కొనకు విసిగిపోయి తనే కాఫీ తీసుకొని వెళ్ళింది, రూములోనికి

శేఖర్ మేల్కొనే వున్నాడు. కళ్ళంతా ఎర్రగా వున్నాయ్ రాత్రంతా నిద్రపోయినట్టు లేదు. ఏదో ఆలోచిస్తూ ఎక్కడో చూస్తున్నాడు, వెల్లకిలా పండుకొని. సిగరెట్ పీకలు ఒక కుప్పగా పడి వున్నాయ్

ఆతని వాలకం చూసి లలిత కాస్త వెనక్కు తగ్గింది కాస్సేపు చూసి "కాఫీ తీసుకోండి" అంది మెల్లగా

కాఫీ తాగుతూంటే అతనిలో కాస్త చైతన్యం వచ్చింది

మళ్ళీ లలిత "మీరు స్నానం చేసి వస్తే నేను టిఫిన్ రెడి చేస్తాను" అంది

టిఫిన్ తినేటప్పుడు శేఖర్ హుషారుగా వున్నాడు. సుజాతను చూడ్డానికి వెళ్తున్నాననేమో!

లలిత అతనో "ఆస్పత్రికి మీ రొక్కరే వెళ్తారా! నేనూ రావాలా?" అంది.

"వదినా! నేను సుజాతను చూసి ఆఫీసు కెళ్ళి పోతాను. సాయంకాలం వద్దురుగాని! అది సరే గాని వదినా! నేను మీకంటే చిన్నవాణ్ణి కదా, వరుసలో నాకు మీరు గీరు అనడం బాగోలేదు. దయ చేసి సుజాతను సుజా అని పిలిచినట్టుగా, మీరు నన్ను శేఖర్ అనండి చాలు" అన్నాడు శేఖర్.

లలితవూరికే నవ్వింది అతను బైటికి వెళ్లేటప్పుడు మళ్ళీ ఆమె "సుజాతకు కాఫీ టిఫన్ పట్టుకెళ్ళండి" అంది

"ప్! వదినా! నేనసలు మీతో మాట్లాడను. మళ్ళీ ప్రారంభించారు. అండి అని."


ఇక సుజాతకు తప్పలేదు. "సరేలే! శేఖర్! సాయంకాలం త్వరగా వచ్చెయ్" అంది ఆమెకేమిటో కొత్తగా వుంది అతన్ని పేరుపెట్టి పిలుస్తుంటే గుండెల్లో ఏదో మధురంగా వుంది

శేఖర్ వెళ్ళిపోయాడు. లలిత "శేఖర్!" "శేఖర్" అని ఎన్నోసార్లు తనకుతాను చెప్పుకుంటూంది.

సాయంకాల మయ్యేటప్పటికి, ఎన్నో యుగాలైనట్లుంది లలితకు శేఖర్ వస్తూనే "వదినా త్వరగా బయల్దేరాలి" అంటూ తొందరపెట్టాడు. లలిత యెక్కడి పనక్కడే వదిలి బయల్దేరేటప్పటికి పది నిముషాలైంది.

అంతలోనే శేఖర్ "అబ్బ! ఎంతసేపు వదినా! త్వరగా! ప్లీజ్! టైమైపోతోంది. అస్సలు మీ ఆడవాళ్ళంతా ఒక్కటే. వూ! అయిందా? ఇంకా ఎంతసేపు వదినా?" అంటూ రకరకాలుగా గునుస్తూ లలితకు చేతులు కాళ్ళు ఆడకుండా చేశాడు.

అతనలా తన్ను ఆత్ర పెడుతుంటే, లలితకు



# చేతి గడియారం

రు 6/—లకు మాత్రమే



5 జ్యూయల్స్‌గల చేతి గడియారం, 5 యేండ్ల గ్యారంటీతోరు 6/-లకే మా చెయిన్ పద్ధతి ప్లాను ద్వారా పొందండి పోస్టేజి రు 1.15 అదనం.

షరా ఈ హానిమూన్ సెంట్ వ్యాపారాభివృద్ధికై యీ ప్లాను ప్రవేశపెట్టబడింది. ఇష్టంలేనివారికి డబ్బు వాపసు చేయబడును

SWISS WATCH TRADING CO
P.B. 87 (APT) Jullundur City





వేసవి
కాలములో
చర్మ
బాధలను పొందకుండుటకు




## సల్ఫర్

టాయిలెట్ సోపు

మొటిమలు, చెమట పొక్కులు, స్వల్పమైన యితర చర్మ బాధలను పోగొట్టి సుఖము నిచ్చును.

BENGAL CHEMICAL
CALCUTTA — BOMBAY — KANPUR


# నన్ను క్షమించరూ!

చెప్పలేనంత హుషారుగా వుంది.

"ఆ సాయంత్రం సుజాతకు జ్వరం తగ్గు ముఖం పట్టింది శేఖర్, భార్యకు పళ్ళు పాలు అందిస్తూ, ఆమె కేవో విషయాలు చెప్తూ నవ్విస్తూ హడావిడి చేస్తున్నాడు.

మాటల్లో కాలం యిట్టే గడిచిపోయింది. ఇద్దరికీ సుజాతను వదలి బైటికి వచ్చేసైమైంది. శేఖర్ సుజాతను వదలి రావటానికి ఒక పట్టాన యిష్టపడలేదు. "సుజా! డాక్టర్నడిగాను. మర్నాడు పొద్దున నిన్ను పిల్చుకొని వెళ్ళమన్నారు. రేపు పొద్దున్న వచ్చేస్తాను. హాయిగా నిద్రపో! ఏం?" అంటూ శేఖర్, భార్యకు పదేపదే చెప్తున్నాడు.

సుజాత నవ్వుతూ "అల్లాగే" అంటూ లలిత వైపు చూస్తోంది. లలిత ఆమె కళ్ళల్లోని దిగులు, వ్యథనీ స్పష్టంగా చూసింది.

"అక్కయ్యా! పొద్దుటి నుంచి సాయంత్రం వరకు నేను లేకుండా ఒంటిగా ఎలా వుంటున్నావో యింటో! ఏమండీ! ఒక్కమాట. రేపు అక్కకు సినిమా చూపెట్టండి. ఆమెకు కాస్త రిలీఫ్‌గా వుంటుంది" అంది సుజాత.

"ఎందుకులే సుజా? నీవు వచ్చిన తర్వాత అందరం పోదాం!" అంది లలిత అప్రయత్నంగా.

అంతలో శేఖర్ "వద్దొదినా! సుజీ చెప్పిం తర్వాత నేను మిమ్మల్ని సినిమాకు తీసుకెళ్ళ వలసిందే" అన్నాడు. సుజాత కూడా "వెళ్ళిరా, అక్కా! ఫర్వాలేదు" అంది.

ఇంటి కొచ్చిన తర్వాత శేఖర్ భోంచెయ్య నన్నాడు

"శేఖర్! అన్నం తినడం ఎందుకు మానడం, సుజాత మరీ మరీ చెప్పిందిగా. తిను మరి" అంది లలిత అతన్ని మందలిస్తున్నట్టుగా. ఆమె స్వరంలో వనువు అపేక్ష మిళితమై వున్నాయి.

"వద్దొదినా! నాకాకలి లేదు. నీవు తినెయ్" అన్నాడతను.

"ఏమిటి శేఖర్ నీ పిచ్చి! చెబితే వినవు కదా, సరే, నేనూ అన్నం తినను పో!" అంది అలుగుతున్నట్టుగా.

"వదినా అల్లాంటి పని మాత్రం చెయ్యకు. నీకు పుణ్యం వుంటుంది పద వడ్డించు" అంటూ శేఖర్ లలిత వెనుక దారి తీశాడు వంటింట్లోకి.

అతనికి లలిత కొసరి కొసరి వడ్డించింది. ఆమెలో వద్దు వద్దని చెప్పి శేఖర్ అలసిపోయాడు. భోజనం ముగిస్తూనే తన గదిలోకి వెళ్ళిపోయాడతను.

ఆ రాత్రి లలితకు ఎంత సేపటికీ, నిద్ర రాలేదు.

"ఏమిటి శేఖర్ మనస్సు. అతని భావాలు తన కంతు పట్టకుండా వుంది. అతనంటే ఎందుకు తనకీ వుత్సుకత అతన్ని దగ్గరగా, ఒంటరిగా, చూస్తుంటే తనలో శిథిలమైన కోర్కెలు మళ్ళీ కొత్తగా పుట్టుకొస్తున్నాయి. మనస్సు వశం తప్పుతోంది. ఎంత దిగాలు పడిపోతాడు మనిషి, తన దగ్గర కూడా. తన బతుక్కి అతనికి ధైర్యం చెపుతోంది. అతన్ని పసిపాపలా దగ్గరకి తీసుకొని లాలించాలనిపిస్తుంది. అతనితో ఏకాంతం, రేపొక్క దినమే! శేఖర్... శేఖర్."

లలిత కెప్పుడు నిద్ర పట్టిందో?

ఆమర్నాడు పొద్దున శేఖర్‌లో ఉత్సాహం పరవళ్ళు తొక్కుతోంది. వంటింట్లో కూర్చొని లలితతో కబుర్లు చెప్తున్నాడు. ఆమెను నవ్విస్తున్నాడు. ఆమె గలాగలా నవ్వుతూ వుంటే తనామెను చూస్తూ, కొత్తగా.

అతని మాటలు వింటూంటే లలితకు మనస్సు పరవశమవుతూంది. అంతులేని ఆవేశంతో, ఆశగా, మనస్ఫూర్తిగా నవ్వుతూ ఆతనికి పూర్తిగా ప్రోత్సాహమిస్తోంది.

ఉన్నటుండి లలిత "అమ్మా" అని అరచింది.

శేఖర్ "వదినా! ఏమైంది. ఏమైంది" అంటూ దగ్గర కొచ్చాడు.

లలిత కుడిచెయ్యి విదలిస్తోంది. బాధతో ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

శేఖర్ చటుక్కున ఆమె చెయ్యి పట్టుకొని చూశాడు. రెండు వేళ్ళు కాలి ఎర్రగా వున్నాయి. అప్పుడే బొబ్బలెక్కుతున్నాయి.

"అరెరె ఎంత పనైంది వదినా! ఆగు" అంటూ పరుగుతో పోయి కొబ్బరినూనె తెచ్చాడు. నూనె రాసి ఏదో ఆయింట్‌మెంట్ పూశాడు. రెండు వేళ్ళకు విడివిడిగా కట్లు కట్టాడు.

అతనలా తన చెయ్యి పట్టుకొని, శుశ్రూష చేస్తూంటే లలిత తన బాధ మరచిపోయింది. అతన్నే చూస్తున్నది, రెప్పలార్పకుండా.

కట్టు కట్టడం ముగించి శేఖర్ "ఎంత పని జరిగింది వదినా! ఇదంతా నా మూలానే! నానుంచే నీవు పరధ్యానంగా వున్నావు" అని ఎంతో చింతిస్తున్నట్టు కనబడ్డాడు. అతని ముఖం ఎర్రగా తయారయింది, సిగ్గుతో.

లలిత ఆతని ముఖం కొన్నిక్షణాల పాటు తదేకంగా చూసింది. శేఖర్ కూడా ఆమెనే చూస్తున్నాడు.

ఆతని ముఖంలో అదే అమాయికత, చూపుల్లో అదే నైర్మల్యం! లలిత వూహించుకుంటున్న భావాలు ఏవీ కనపడలేదామెకు.

"ఏమిటి వదినా! అలా చూస్తున్నావ్! నొప్పిగా వుందా? ఇక నీవు వంటింటి చాయలకు పోవటానికి వీల్లేదు. ఆఫీస్‌బాయ్‌తో హోటల్ నుంచి భోజనం పంపిస్తాను. పూర్తిగా రెస్టు తీసుకో. సాయంకాలం సుజాతను చూడడానికి వెళ్తాంగా! అక్కడే డాక్టర్ దగ్గిర మంచి మందు వేళ్ళకు పూయిస్తే సరి. వదినా నాక్కాస్త పనుంది నేనిప్పుడే వెళ్ళాలి యేం?" అంటూ శేఖర్ ఆవేళ త్వరగా వెళ్ళిపోయాడు, యింటి నుంచి.

ఆదినమంతా లలిత ఒంటరితనంతో, ఎన్నో ఆలోచనలతో, ఎంతో బాధపడింది. ఆమె కావేళ చెయ్యటానికి పన్లులేవు. ఏం చెయ్యాలో తోచ లేదు. హోటల్ భోజనం బాగానే వుంది.

# నన్ను క్షమించరూ!

అనాలోచితంగా శేఖర్ సుజాతల గదిలోకి వెళ్ళింది. అల్మెరా నిండా సుజాత చీరలు లెక్కకు మించి వున్నాయి. వాటిలో లలితకు ఎరుపు రంగు షిఫాన్ చీర నల్లటి లేసు బార్డర్‌తో ఎంతో నచ్చింది. భుజంపై వేసుకొని, అద్దంలో చూసుకొంటూ ఎలా వుంటుందో పరీక్షగా చూసుకొంది. దాంతో ఆమెకు తన అందం యినుమడించినట్లు కన్పడింది.

సాయంకాలం నాలుగ్గంటల నుంచి శేఖర్ కోసం ఎదురు చూస్తోంది లలిత. ఎల్లాగైతేనేం, ఐదు గంటలకు ఆమె తపస్సు ఫలించినట్టుగా శేఖర్ తిరిగొచ్చాడు.

వస్తూనే "వదినా, ఎలా వుందినొప్పి." అంటూ అడిగాడు.

లలితకు ఆ నొప్పి ఎప్పుడో తగ్గిపోయింది. అదే మాట చెప్పిందతన్తో.

ఐనా శేఖర్‌కు తృప్తి కలగలేదు. డాక్టర్‌కు చూపించి మంచిమందు వేయిద్దాం! వదినా! ఎందుకైనా మంచిది.' అన్నాడు ఎంతో ఆపేక్షతో.

శేఖర్ తన గదిలోకి వెళ్ళి డ్రెస్ చేసుకొని వచ్చాడు కాస్సేపటికి. లలిత అలాగే కూర్చొనుంది, పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ. శేఖర్ కాస్త చిరాకు కనపరచాడు. "లే వదినా! త్వరగా పోవాలి, నర్సింగ్ హోమ్‌కు వెళ్ళాలి. సుజాతను చూసి సినిమాకు వేరే వెళ్ళాలి. అప్పుడే ఆరు కావస్తోంది" అన్నాడామెతో.

లలిత అతన్నే తదేకంగా చూస్తోంది. మనిషి ఎర్రగా నిండుగా వున్నాడు. నున్నటి కోలముఖం అద్దాల్లా మెరిసే స్వచ్ఛమైన కళ్ళు గిరిజాల జుత్తు, తెల్లటి టెర్రిలిన్ సూట్‌లో అతని అందం యినుమడించింది. అతనిలోని ఆకర్షణకు లలిత లొంగిపోతూంది.

శేఖర్ యికవుండలేక పోయాడు. లలిత దగ్గరగా వచ్చి ఆమె చెవి దగ్గర నిల్చొని గట్టిగా అరచినంత పని చేశాడు.

"వో వదినా! నిద్రపోతున్నావా? బాగానే వుంది అమ్మాయిగారి పని! లే!లే!" అన్నాడు.

అతని వూపిరి లలిత చెంపలకు వెచ్చగా తగులుతూంది. లలిత ఒళ్ళు పులకరించింది. ఏదో ఆవేశం ఆమెనావహించింది. ఆమెలో నిద్రపోతున్న వాంఛలు మేల్కొని పడగలు విప్పాయి. చల్లారిపోయిన రక్తం ఒక్కసారిగా సలసలా కాగజొచ్చింది ఆమె నరాలన్నీ కోర్కెలతో అల్లల్లాడసాగాయి.

అంతలోనే శేఖర్ "వో! పర్సు మర్చిపోయాను" అంటూ దూరంగా జరిగి తన గదిలోకి వెళ్ళాడు.

మళ్ళీ కాస్సేపటికి అతను లలితను చూసేటప్పటికి తన కళ్ళను నమ్మలేకపోయాడు.

లలిత ఎరుపురంగు షిఫాను చీర కట్టుకొంది దానికి మాచ్ అయే చోళీ వేసుకొంది. కోర్కెలతో వూగిపోతూ లలిత ఆతని ముందొచ్చి నిలుచొంది

ఆమెను చూస్తూ, "ఎంత బాగుంది వదినా! మీ నుంచి ఆ చీరకు అందం యినుమడించింది. పోదాం పద, టైమైపోతోంది." అంటూ బయటికి దారి తీశాడు.

సుజాత లలితను చూసి ఎంతో సంబర పడింది. "అక్కయ్యా! ఎంత ముద్దొస్తున్నావు" అంటూ తెగ పొగిడింది.

లలిత సిగ్గుతో కుంచించుకు పోయింది చెల్లెల్తో మనసువిప్పి మాట్లాడటానికి ఆమెకు ధైర్యం చాల్లేదు

శేఖర్ సుజాతను చూస్తూనే సినిమా సంగతి గాని, తదితర విషయాలు గాని, పూర్తిగా మరచిపొయ్యాడు భార్యతో 'సుజా! నీవిక్కడికి వచ్చి మూడురోజులైంది అబ్బ! నాకు మాత్రం మూడు యుగాలైనట్టుంది రేపు నిన్ను డిశార్జి చేస్తారట. సుజా! జన్మజన్మలకీ వద్దు మనకీ ఎడబాటు. నీవు యింట్లో పూర్తిగా రెస్టు తీసుకోవాలి. లేదా నాపై ఒట్టే, ఏం? అన్ని పన్లనే చేస్తాగా! నీవు హాయిగా పండుకొని నేనేమిచెయ్యాలో ఆజ్ఞాపిస్తూండు! ఏం సుజీ!" అంటూ గునుస్తున్నాడు.

సుజాత నవ్వుతూ "అల్లాగేం? సరేలెండి. ముందు మీ పన్లు మీారు నా సహాయం లేకుండా చేసుకోడం నేర్చుకోండి తర్వాత నా సంగతి చూద్దురు గాని!" అంది

శేఖర్ ఉక్రోషంతో "హో! సుజా! నీ కెప్పుడూ వేళాకోళమే! ఐనా చూస్తావుగా? నేను పూర్తిగా మారాను! నీవే ఆశ్చర్యపోయి నీ ముక్కుమీద వేలు వేసుకొని బొమ్మలా నిలబడాలి" అన్నాడు ధీమాగా.

"సర్లెండి! ఇదే కళ్ళతో చూస్తానుగా!" అంది సుజాత.

వాళ్ళిద్దరు మాటల్లోపడి లలిత ధ్యాసే మరిచిపొయ్యారు, కాస్సేపు లలితకేం పాలుపోలేదు. వచ్చిపోయే నర్సులను, డాక్టర్లను గమనిస్తోంది. ఐతే ఆమె మనసుమాత్రం ఏమేమిటో ఆలోచిస్తోంది. శేఖర్‌పై కసి పుట్టుకొస్తోంది. "ఏమిటి? అతని వాలకం! ఇక్కడి కొచ్చేదాకా ఎంత వూరించాడు. భార్యను చూస్తూనే ఈ లోకంలోనే వున్నట్టులేదు. ఐనా భార్యంటే ఎందు కింత పిచ్చి ఈతనికి. ఇంతకీ ఏముంది సుజాతలో, అంత ఒళ్ళు మరచి పోవడానికి. ఛ! ఛ! ఈతన్ని నమ్మకోడం తనదే బుద్ధి తక్కువ! మళ్ళీ సినిమాకు పిలిస్తే రానని బాగా గట్టిగా అతనికి బుద్ధి వచ్చేట్టు చెప్పాలి. తనంటే ఎందు కింత నిర్లక్ష్యం శేఖర్‌కి!" లలితకు ఆవేశం ముంచుకొస్తోంది. ముఖం కందగడ్డలా తయారైంది.

సుజాత, లలితను గమనించింది తాము చేసిన తప్పు తెలిసొచ్చింది. "పాపం! ఆమెను ఒదిలి తాము చేస్తున్నదేమిటి? అక్క ఎంత బాధపడ్తోందో? ఏం చెయ్యాలి?"

తక్షణం భర్తతో యిలా అంది "ఇంత మతిమరపైతే ఎల్లాగండి? అవతల సినిమాకు టైమవుతోంది అక్కయ్యను జాగ్రత్తగా తీసుకెళ్ళండి. నాకు నీరసం వస్తోంది మీాతో మాటలు పెంచుకొని" లోలోపల ఆమెకు బాధగా వున్నా

సుజాత మాటలకు శేఖరం దెబ్బతిన్న పక్షిలా గిలగిలలాడాడు దీనంగా లేచి నిల్చొని "అల్లాగే సుజీ! మేం వెళ్తాం! నీవు హాయిగా పడుకో!" అంటూ లలితతో "రా వదినా! వెళ్దాం! ఇంకాస్సేపే వుంది" అన్నాడు మెల్లగా.

అతన్నా స్థితిలో చూసేటప్పటికి సుజాతకు, శేఖరాన్ని తన గుండెల కదుముకొని వోదార్చాలనిపించింది ఆమె కళ్ళల్లో నీళ్ళొకటే తక్కువ. మనస్సు నిశ్శబ్దంగా యేడుస్తోంది

లలితతో "వెళ్ళిరా! అక్కయ్యా రెపట్నుంచి నీకు ఎలాగు తప్పదు యింటి చాకిరి" అంది బలవంతంగా నవ్వు తెచ్చుకొంటూ, సుజాత

తన ఆలోచన్లని పక్కకినెట్టి సినిమాకి బయల్దేరింది ఆమెలో ప్రవేశించిన విషపు ఆలోచన, "ఇంత మంచి సమయం మళ్ళీ నీకురాదు. చేజిక్కిన అవకాశాన్ని వదులుకోకు ఛీ! ఛీ!" అంటూ లలితని ముందుకు తోస్తోంది.



అహం అడ్డొస్తున్నా, "వెళ్లొస్తాం, సుజా! నీవు రెస్టు తీసుకో!" అంటూ లలిత, శేఖర్‌కంటే ముందుగా బయల్దేరింది.

సినిమాచూసి రాత్రి పదకొండు గంటలకు యిల్లు చేరారు యిద్దరూ. సినిమాలోగాని, యింటికొచ్చిం తర్వాతగాని శేఖర్‌లో మొదటవున్న ఉత్సాహం, చురుకుతనం అంతగా వున్నట్లు కనపళ్లేదు లలితకు.

ఎల్లాగైతేనేం, "సినిమా బాగుందా వదినా?" అంటూ అడిగాడు శేఖర్.

లలిత మర్మ గర్భంగా నవ్వి బాగానే వుందంది.

సినిమాలో నాయకీ నాయకుల ప్రణయ సన్నివేశాలుచూసి, లలిత ఎప్పుడు లేనంత పరవశించి పోయింది. ఆమె మనస్సు తహతహలాడుతోంది, శేఖర్ పొందుకోరుతూ. అదేపనిగా, సినిమాలో పక్క పక్కన కూర్చొన్నపుడు, శేఖర్ చేతికి తన చేయి తగిలించింది రెండు మూడుసార్లు. అతనే భావమూ వ్యక్తం చేయకపోగా ఆమెలో తొందరపాటు యింకా ఎక్కువయింది.

అన్నంతింటూనే, శేఖర్ తన గదిలోకివెళ్ళిపోయాడు, పడుకోవటానికి.

లలిత మనస్సు, మనస్సులో లేదు. త్వరత్వరగా తనపనులన్నీ ముగించింది. సాయంకాలం ధరించిన డ్రస్సులో ఒళ్ళంతా చీకాకుగా వున్నా, అల్లాగేవుంది చీర మార్చుకోకుండా.

అడుగులు తడబడుతుండగా, మెల్లగా శేఖర్ గది వైపు వెళ్ళింది. లోపలనైట్ లైటు వెలుగుతూనే వున్నట్లుంది. లలితకు అనుమానం కలిగింది. శేఖర్ నిద్రపోకుండా తనకోసం ఎదురు చూస్తున్నాడని.

బరువెక్కుతున్న గుండెలతో అతని గదిలోకి ప్రవేశించింది.

ఆమెకంతులేని ఆశాభంగం కలిగింది. శేఖర్ అప్పుడే నిద్రలో మునిగి పోయివున్నాడు.

నిద్రాదేవి ఒడిలో ఆడుకొంటున్న పసిపాపలా వుందాతని ముఖం. ఫాన్‌నుండి వచ్చే గాలికి, ఆతని వుంగరాలజుత్తు, అదేపనిగా, అలల్లా కదులుతున్నాయి.

లలితకు కాళ్ళు ఒణుకుతున్నాయి. అంత చల్లని గాలిలో కూడా, ఒళ్ళు చెమటలు పడ్తూంది. ఏం చెయ్యాలో తోచడంలేదామెకు. అదేపనిగా శేఖర్‌ని చూస్తూవుంది. మొండిధైర్యంతో ముందుకు సాగింది.

శేఖర్ వెల్లకిలా పండుకొని, రెండుచేతుల్తోను పుస్తకాన్ని, ఎదపై ఆనించుకొని వున్నాడు.

లలిత మెల్లగా ముందుకు ఒంగి అతని ముఖాన్ని తనివిదీరా కొన్ని నిమిషాలు చూసింది. మెల్లిగా శేఖర్ పట్టుకొన్న పుస్తకాన్ని తన చేతుల్తో విడదీసింది. ప్రక్కనేవున్న టేబిల్‌పై, దాన్ని చప్పుడు చెయ్యకుండా వుంచడానికి పక్కకి తిరిగింది.

"సుజీ! నా సుజీ!" అంటూ గొణుగుతూ పక్కకు తిరిగాడు శేఖర్ అంతలోనే.

ఆ మాటలు చెవిని పడ్తూనే, లలితకు సిగ్గు, భయం నరనరాల్లో వ్యాపించి పోయాయి. చేష్టలుడిగి ఒక్క క్షణంపాటు శిలైంది. అంతలోనే, ఆమెకు తెలీకుండానే ఆమె కాళ్ళు బలాన్ని కూడగట్టుకున్నాయి. కొన్నా క్షణాల్లో, తన గదిలోకి పరిగెత్తి వచ్చేసింది లలిత.

ఆమె గుండెలు యింకా వేగంగా కొట్టుకుంటున్నాయి. ఎంతప్రయత్నించినా, లలితకు శరీరం వశం తప్పుతుంది.

దాదాపు పిచ్చిదాన్లా తయారయ్యింది, లలిత.

ఆమె అనాలోచితంగా చేతులు చూసుకొంది. శేఖర్ పట్టుకొన్న పుస్తకాన్ని పట్టుకొచ్చేసింది,




కుటికురా
ఆయింట్ మెంట్
మీ చర్మాన్నిగురించి
మంచిశ్రద్ధ వహిస్తుంది

కుటికురా ఆయింట్ మెంట్ మొటిమలు, సూరేడుకాయలు మరియు పొక్కులను తొలగించేందుకు మీ చర్మంలో చాలా లోతుకు వెడుతుంది. కొలుట, ఒరసిన లేక పొడి చర్మము, కందిన చర్మము, కోసుకొనుట, పురుగు కాట్లు, గజ్జి మొదలైన చర్మ వ్యాధులకు ఉపశమనము కలిగిస్తుంది. బడలిన శరీరాన్ని ఉత్తేజపరచి మృదువుగా నున్నగా వుండేలా వుంచుతుంది.

కుటికురా ఆయింట్‌మెంట్

చర్మ రక్షణకు ప్రపంచమంతా ప్రఖ్యాతి పొందింది.





2 సైజులలో లభిస్తోంది

NAS 110R




ప్రఖ్యాతి కెమిస్టులు ... డ్రగ్గిస్టు లందరివద్ద లభించును.
Advt Permitted under G O MS No 1121




# నన్ను క్షమించరూ!

ఆతని గదిలోనుండి వచ్చేటప్పుడు.

పేజీలు తిప్పి చూసింది. శేఖర్ డైరీ. కాస్సే పైన తర్వాత ఆమెలో వుత్సాహం ముంచుకొచ్చింది డైరీని చూడడానికి. పేజీలు తిప్పుతూ శేఖర్ డైరీ చదవసాగింది లలిత.

"సుజాత చెప్పింది, వాళ్ళక్క లలిత వస్తూందని యిక్కడికి ఆమె ఎలా వుంటుందో నేను సరిగ్గా చూళ్లేదు. ఐనా సుజాత జాబు వ్రాసిన తక్షణం ఆమె ఇక్కడికి వస్తుందంటే, నాకెంతో గౌరవం కలుగుతోంది ఆమె పట్ల. సుజాతకు యికనుంచి కాస్త విశ్రాంతి లభిస్తుంది."

"ఈ వేళ వదినను చూశాను. ఆమెను చూస్తూనే వదినా అని నోరారా పిలవాలనిపించింది. ఆమె అందమైన కళ్ళల్లో దిగులు, నిరాశ గూడుకట్టుకొని వున్నాయి. దేవుడు ఎంత అన్యాయం చేశాడు వదినకు. అతని లీలలకు, అమాయికత్వం, అసహాయత మూర్తీభవించిన ఈమేనా గురి! ఛ! విధి ఎంత క్రూరమైంది"

"వదిన్ని యింట్లో చూస్తుంటే నాకు ఎంతో ధైర్యంగా వుంది సుజీని గురించి యిప్పుడు నాకె లాంటి చింతగాని, భయంగాని లేవు. ఆఫీసులో నిశ్చింతగా పని జరిగిపోతోంది. ..."

".. వదిన శేఖర్ అని నన్ను పేరెట్టి పిలవమని ఒప్పించేటప్పటికి ఎంతో కష మయింది. ఐనా, ఆమె ఏమండీ! మీరు, గీరని పిలుస్తూంటే నాకు సిగ్గుగా వుంది, ఎవరో పరాయి వాణ్నని, ఆమెకు ఏమి కానని పిస్తోంది .."

"... .. వదినా! వదినా! అని పిలవడం కంటే ఆమెను సుజీ పిల్చినట్టు అక్కయ్యా! అని పిలవాలని పిస్తోంది . . ."

"శేఖర్ అని పేరుపెట్టి పిలుస్తూంటే నాకు ఎక్కడో దూరంగా వున్నా అమ్మా, అక్కా గుర్తుకు వస్తున్నారు. వారిద్దర్నీ వదిన్లో చూసుకొంటున్నాను . ..."

ఇక చదవలేక పోయింది లలిత. ఒక్కక్షణం తన గుండె ఆగి పోయినట్టనిపించింది భూమి బద్దలౌతున్నట్టుంది. ఆకాశం విరిగి మీద పడుతున్నట్టు అనిపించింది.

శేఖర్! శేఖర్ అంటూ అస్పష్టంగా గొణిగింది. శేఖర్ రూపం ఆమె వూహలో నిలిచింది. "వదినా! నీకు దేవుడు ఎంత అన్యాయం చేశాడు!" అంటున్నట్టున్నాడు. నిశ్శబ్దంగా రోదిస్తున్నట్టు కనిపించాడు ఆతని ముఖం బంగారంలా మెరుస్తోంది.

అప్రయత్నంగా చేతులెత్తి నమస్కారం చేసింది లలిత. "తమ్ముడూ! నేను పాతకిని, కళంకినిని. నీ మంచితనం నేను భరించలేను చెల్లీ! సుజా! నీకెంత కీడు తలపెట్టాను. నన్ను క్షమించు. హే భగవాన్! నన్ను క్షమించు! క్షమించు!!" అంటూ పశ్చాత్తాపాగ్నితో, వొళ్లెల్లా దహించుకు పోతుంటే, కన్నీళ్ళు కారిపోతుంటే నిశ్శబ్దంగా విలపించసాగింది, లలిత.●